


సిరిమాను చెట్టును కొడుతున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు



భక్తుల కోలాహలం నడుమ విజయనగరంలో సిరిమాను చెట్టు ఊరేగింపు

అడుగడుగునా నీరాజనం


పులివేశాల సందడి

- సిరిమాను చెట్టుకు అపూర్వంగా స్వాగతం పలుకుతూ పూజలు చేసిన భక్తులు
- నగర ప్రజల కోలాహలం నడుమ హుకుంపేటకు చేరిక


సిరిమాను చెట్టు రాక కోసం పసుపు నీళ్లతో ఎదురుచూస్తున్న మహిళా భక్తులు


సిరిమాను చెట్టు ఊరేగింపులో డ్రమ్స్ మోగిస్తున్న యువకుడు

విజయనగరం రూరల్/ డెంకాడ, సెప్టెంబరు 28: జై పైడిమాంబ నినాదాలు.. మేళతాళాలు.. మహిళామణుల కోలాటాలు.. పులివేశాల సందడి నడుమ పైడిమాంబ సిరిమాను చెట్టు ముందుకు సాగింది. నగరంలో ప్రతిచోటా అపూర్వ స్వాగతం లభించింది. శనివారం రాత్రి ఏడు గంటలకు నగరానికి చేరుకుంది. పెదతాడివాడలో బయలుదేరినప్పటి నుంచి భక్తులు నీరాజనం పలికారు. నగరంలో జమ్ము జంక్షన్ దాటిన అనంతరం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో విజయనగరంలోని దాసన్నపేట ఎఫ్‌సీఐ గోదాం రోడ్డుకు చేరుకుంది.. ఆపై దాసన్నపేట, నవాబుపేట వాసులు అధిక సంఖ్యలో సిరిమాను చెట్టుకు పసుపు, కుంకుమలు సమర్పించారు. ప్రతిచోటా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగినా వెంట, వెంటనే పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అంబేడ్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, పార్కుగేటు, సుద్దవీధి మీదుగా పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసం ఉన్న హుకుంపేటకు చేరింది. ఆలయ ఈవో డీవీ ప్రసాద్‌రావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, ఇతర సిబ్బంది, అర్చకులు, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖాధికారులు కూడా సిరిమాను చెట్టు రాక కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో పూజారి ఇంటి వద్దకు సిరిమాను చేరుకుంది. ఉదయం పెదతాడివాడలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు, అవనాపు భావన, విజయ్‌తో పాటు, మాజీ కౌన్సిలర్లు, నగర ప్రముఖులు చెట్టుకొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఊరేగింపులో మహిళల కోలాటం

3 నుంచి టెట్

- జిల్లా వ్యాప్తంగా 22,889 మంది అభ్యర్థుల హాజరు
- ఐదు కేంద్రాల్లో పరీక్ష



కలెక్టరేట్, సెప్టెంబరు 28: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. అక్టోబరు 21వ తేది వరకూ (11,12 తేదీల్లో మినహా) పరీక్ష కొనసాగుతుంది. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. 22,889 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. రెండు పూటలా పరీక్ష జరగనుంది. ఉదయం 9.30 నుంచి 12 వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్నారు. బొబ్బిలి స్వామి వివేకాంద ఇంజినీరింగ్ కాలేజీలో 1800 మంది, ఎంవీజీఆర్‌లో 4231 మంది, సత్య ఐయాన్ డిజిటల్ టెక్నాలజీలో 12,852 మంది, సీతంలో 3126 మంది, లెండిలో 880 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

రామతీర్థంలో ప్రాయశ్చిత్త పరిహార హోమం

పాల్గొన్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, సెప్టెంబరు 28: తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శనివారం ప్రాయశ్చిత్త పరిహార శాంతి హోమం నిర్వహించారు. సుమారు మూడున్నర గంటల పాటు జరిగిన హోమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ తిరుమల ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమని, లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ జరగడం బయటపడ్డాక కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. తిరుమలలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్త పరిహార శాంతి హోమం నిర్వహించి దేవుని ఆశీస్సులు కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు సువ్వాడ రవిశేఖర్, చనమల్లు వెంకటరమణ, కడగల ఆనంద్‌కుమార్, మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్‌తో పాటు దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు, రామతీర్థం సేవా సంఘం ప్రతినిధులు రేగాన గోవిందరావు, కాటమనేని బాలాజీ, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న ఎంపీ , ఎమ్మెల్యే తదితరులు



హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబరు 28: జిల్లాలో ఒక రోజు పర్యటనకు వచ్చిన ఇద్దరు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను శనివారం కలెక్టర్ అంబేడ్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు, జస్టిస్ సత్తి సుబ్బిరెడ్డి జిల్లా పర్యటనకు వచ్చారు. వారితో కలెక్టర్ కొద్దిసేపు మాట్లాడారు. వారి వెంట జిల్లా న్యాయాధికారి సాయి కళ్యాణ చక్రవర్తి కూడా ఉన్నారు.

ఆర్‌డీవో కీర్తి బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్, సెప్టెంబరు 28: విజయనగరం రెవెన్యూ డివిజన్ అధికారిగా దాట్ల కీర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీఎంఆర్‌డీఏలో కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన కీర్తి ముందుగా కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఈమె జిల్లాలో బీసీ సంక్షేమాధికారిగా పనిచేశారు. ఇక్కడ ఆర్‌డీవోగా పనిచేసిన సూర్యకళను జీఏడీలో రిపోర్టు చేయాలంటూ బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



శారీరక వ్యాయామం కీలకం

ఒత్తిడి లేని జీవితంతోనే గుండె జబ్బులు దూరం: ఎస్పీ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 28 : వత్తిళ్లలని జీవితం, శారీరక వ్యాయామంతోనే గుండెజబ్బులు దూరం అవుతాయని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా తిరుమల మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి ఆసుపత్రి వరకు గుండె జబ్బులపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. గుండెను పదిలంగా చూసుకోకపోతే ప్రాణలకే ముప్పు అని చెప్పారు. డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ గుండెకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన స్క్రీనింగ్ పరీక్షల ద్వారా గుర్తిస్తే 80 శాతం చికిత్సతో మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డాక్టర్లు కృష్ణశాంతి, అశోక్‌కుమార్, శరత్‌చంద్రపాత్రో, డీఎస్పీలు శ్రీనివాసరావు, యూనివర్స్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ



మారారు సరే.. మార్పు వస్తుందా?



జిల్లాలో దాదాపు సబ్ రిజిస్ట్రార్‌లందరూ మారారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లు, సబార్డినేట్‌లందరికీ స్థానచలనం కలిగింది. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు, ఉద్యోగులను ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి బదిలీ చేయడం ద్వారా కొత్త మార్కు పాలనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చూడాలనుకుంటోంది. ఈ బదిలీలతో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్నీ కొత్త ముఖాలే కనిపిస్తున్నాయి. అయితే ఈ మార్పుతో ఫలితం ఉంటుందా?నన్న చర్చ సర్వత్రా జరుగుతోంది.

- గత ఐదేళ్లుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు
- కూటమి ప్రభుత్వం వచ్చాక సమూల ప్రక్షాళన.. అధికారుల బదిలీలు
- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులనూ కదపాలంటున్న కక్షిదారులు



శృంగవరపుకోట, సెప్టెంబరు 28: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రక్షాళన చేస్తున్న సంగతి తెలిసిందే. బ్రిటీష్ కాలం నాటి రాచరిక విధానానికి స్వస్తి పలికారు. పొడవాటి పోడియం, రైలింగ్‌లను తొలగించిన ప్రభుత్వం వాటి స్థానంలో మిగతా కార్యాలయాల మాదిరి అధికారి కుర్చీ, ముందు టేబుల్, వాటి ముందు క్రయ, విక్రయదారులు కూర్చొనేందుకు సీట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసింది. తద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి, లంచావతారాలకు ఆస్కారం లేని కొత్త ఒరవడిని తీసుకురావాలని భావిస్తోంది. ఈ కార్యాలయాల్లో గత ప్రభుత్వంలో చేయి తడిపితేనే పనిజరిగేది. క్రయ, విక్రయదారులతో ఒప్పందం కుదిరితే ఎలాంటి భూమినైనా రిజిస్ట్రేషన్ చేసేసేవారు. గ్రామ రెవెన్యూ అధికారుల ఫోర్జరీ సంతకాలతో భూములకు రిజిస్ట్రేషన్ జరిగిన సంఘటనలు కోకొల్లలు.

ఇరవై ఏళ్లు పూర్తయిన డి-పట్టాదారులకు వైసీపీ ప్రభుత్వం భూ హక్కులను కల్పించింది. ఆ ప్రకారం జిల్లాలో 5,168.36 ఎకరాల డిపట్టా భూములకు (ఫ్రీహోల్డ్) హక్కులు కల్పించారు. ఇలా ఫ్రీహోల్డ్ జరిగిన వెంటనే శృంగవరపుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 98.32 ఎకరాలు, భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 41.563 ఎకరాలు, గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 39.99 ఎకరాలు, విజయనగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 10.38 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్‌లు జరిగిపోయాయి. ఫ్రీహోల్డ్ జరిగిన ఒక ట్రెండు నెలల్లో పేదల భూములను పెద్దల చేతుల్లో పెట్టేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు చాలా ఉత్సాహం చూపాయి. అసైన్డ్ భూములకు జిరాయితీ నెంబర్‌లను నమోదు చేసి రిజిస్ట్రేషన్ కానిచ్చిన సబ్ రిజిస్ట్రార్‌లూ ఉన్నారు. చేతిలో కాసులు పడితే నిబంధనలను పక్కన పెట్టిన ప్రబుద్ధులకు కొదవే లేదు.

భూముల అమ్మకాలు.. కొనుగోలు సమయంలో కమీషన్ ఇస్తేనే కాగితంపై సంతకం పడేది. చాలా కార్యాలయాల వద్ద పలువరు డాక్యుమెంట్ రైటర్లే మధ్యవర్తులు. కొంత మంది సబ్ రిజిస్ట్రార్‌లు కార్యాలయంలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులను డబ్బులు వసూళ్లకు వాడుకున్నారు. భూముల క్రయ, విక్రయదా రుల నుంచి డాక్యుమెంట్ రైటర్‌లు తీసుకున్న సొమ్మును వీరి వద్ద దాచేవారు. కార్యాలయ పనిదినాలు ముగిసిన తరువాత వేరోచోట సొమ్మును తీసుకొనేవారు. అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరకకుండా ఇలా జాగ్రత్తపడేవారు. తాత్కాలిక ఉద్యోగులను కదపకపోవడం, డాక్యుమెంట్ రైటర్లు స్థానికంగా వున్నవారు కావడంతో బదిలీపై వచ్చిన అధికారులు, ఉద్యోగులకు ఈ అవినీతిని అలవాటు చేస్తూ వచ్చారు. తాత్కాలిక ఉద్యోగులు, ఇతర పద్ధతిలపై పనిచేసే వారిని కూడా ఈ కార్యాలయాల నుంచి వేరే కార్యాలయాలకు మార్పుచేయడంతో పాటు డాక్యుమెంట్ రైటర్ల (దస్తావేజులు రాసేవారు)ను కార్యాలయాలకు దూరంగా ఉంచినప్పుడే కూటమి ప్రభుత్వం లక్ష్యం నేరవేరే అవకాశముందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


LYCA PRODUCTIONS
SRI LAKSHMI MOVIES
OCT. 10
WORLDWIDE RELEASE
SUBASKARAN PRESENTS
SUPERSTAR RAJINIKANTH
వేట్టయన్
ద హంటర్
WRITTEN & DIRECTED BY T. J.GNANAVEL
AN ANIRUDH MUSICAL
DOP SR KATHIR ISC
PRODUCED BY SUBASKARAN
TAMIL TELUGU HINDI KANNADA


people MEDIA FACTORY
CHITRALAYAM
MACHO STAR GOPICHAND
A SREENU VAITLA FILM
OCT 11TH
IN CINEMAS WORLDWIDE
విశ్వం
T.G.VISHWA PRASAD VENU DONEPUDI
TELUGU


CULT CONCEPTS
From The Director of
మంత్ర మంగళ
'OSHO' THULASIRAM'S
దక్షిణ
OCTOBER 4TH RELEASE
PRODUCER :
ASHOK SHINDE


PHOENIX GAGA
JOKER FOLIE À DEUX
THE WORLD IS A STAGE
OCTOBER 2nd
WEDNESDAY RELEASE
FILMED FOR IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


NANDAMURI TARAKA RAMARAO ARTS
YUVASUDHA ARTS
MASSIVE BLOCKBUSTER
MAN OF MASSES NTR
DEVARA
PART 1
KORATALA SIVA
AN ANIRUDH MUSICAL
IN CINEMAS NOW


BGM STUDIO
దసరా నవరాత్రుల శుభాకాంక్షలతో
ADITYA MUSIC
OCTOBER 3RD
WORLDWIDE RELEASE
IN THEATRES
చిట్టి పొట్టి
Story, Screenplay, Producer & Director
BHASKAR YADAV DASARI
Music SRI VENKAT Editor BALAKRISHNA BOYA DOP MALHARBHAT JOSHI
Choreography KAPIL Stunts STAR MALLI PRO LAXMI NIVAS


BLOCKBUSTER HIT
ASIAN SURESH
2D ENTERTAINMENT
KARTHI ARVIND SWAMI
సత్యం సుందరం
WRITTEN & DIRECTED BY C. PREMKUMAR
PRODUCED BY JYOTIKA SURIYA
Co Produced by Rajsekar Karpoorasundarapandian
IN CINEMAS NOW

సాగనంపారు

● వైసీపీ అస్మదీయ అధికారులకు స్థానభ్రంశం
● జిల్లాకు కొత్తవారు రాక

విజయనగరం(ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 28: జిల్లాలో కీలక అధికారుల మార్పు తంతు జరుగుతోంది. ఈ ప్రక్రియలో అనేకాంశాలను ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వంలో నేతల అడుగులకు మడుగులొత్తిన వారిని బదిలీ చేస్తున్నారు. కొత్త వారిని జిల్లాకు తీసుకొస్తున్నారు. అందులో భాగంగానే విజయనగరం ఆర్డీవోగా దాట్ల కీర్తిని నియ మించారని తెలుస్తోంది. వాస్తవానికి వైసీపీ హయాంలోనే ఆమె జిల్లాకు రావాల్సి ఉంది. అప్పట్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఈమె రాకను అడ్డుకున్నారనే ప్రచారం జోరుగా సాగింది. బీసీ సంక్షేమ శాఖ అధికారిగా పనిచేసిన కీర్తి గ్రూప్-1 ద్వారా ఆర్డీవోగా ఎంపికయ్యారు. తొలిసారి పోస్టింగ్ ఇక్కడే పొందారు. అయితే మాజీ మంత్రి కీర్తి ఇక్కడకు రాకుండా రాష్ట్రస్థాయిలో పైరవీలు చేసి వీఎంఆర్‌డీఏ లో కార్యదర్శిగా నియమించారు. ఇదిలా ఉండగా ఎన్నికల ముందు జిల్లాలో ముగ్గురు ఆర్డీవోలకూ బదిలీ జరగ్గా మిగతా ఇద్దరూ రిలీవ్ అయ్యారు కానీ అప్పటి జిల్లా మంత్రి పరపతిని వినియోగించుకొని సూర్యకళ కదలలేదన్న ఆరోపణ ఉంది. ఇప్పుడు ఆమె స్థానంలో దాట్ల కీర్తిని నియమించారు. గత ప్రభుత్వంలో తమ మనుషులనే అధికారులుగా తెచ్చుకునేందుకు ఎంతవరకైనా వెళ్లేందుకు ప్రయత్నించేవారు. జడ్పీ విభాగంలో పనిచేసిన ఒక అధికారి గత వైసీపీ ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహక రించారు. అతన్ని కూడా ఈ బదిలీల్లో పొరుగు జిల్లాకు బదిలీ చేశారు. వైసీపీ నేతలకు ఎన్నో పనులు ఈజీగా చేసిపెట్టిన రెవెన్యూ విభాగంలోని జిల్లా అధికారి నేటికీ కొనసాగడం పై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఎవరి ఫోన్‌కూ స్పందించరన్న ఆరోపణ ఉంది. ఇటీవల ఓ ఎమ్మెల్యే ఫోన్‌కు కూడా ఆన్సర్ చేయకపోవడంతో ఆయన కలెక్టర్‌తో మాట్లాడారని సమాచారం.



దినసరి కార్మికులకు కనీస వేతనం పెంపు

కలెక్టరేట్: ప్రభుత్వ శాఖల నియంత్రణలో, పాక్షిక ప్రభుత్వ నియంత్రణలో పనిచేసే ఎన్ఎంఆర్ డైలీ వేజెస్ కార్మికులకు వేతనాలను పెంచుతూ జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ నిర్ణయం తీసుకున్నారు. పెంచిన ఈ వేతనాలు జూలై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకూ అమలవుతాయని తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లాస్థాయి వేతనాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో గత ఏడాది ధరలను పరిశీలించి ఈ ఏడాది అంతకన్నా 10.12 శాతాన్ని పెంచుతూ కమిటీ నిర్ణయం తీసుకుంది. అన్‌స్కిల్డ్ వారికి రూరల్‌లో రూ.465, అర్బన్‌లో రూ.485గా నిర్ణయించారు. సెమీ స్కిల్డ్ వారికి రూరల్‌లో రూ.560, అర్బన్‌లో రూ.590, స్కిల్డ్ కార్మికులకు రూరల్‌లో రూ.680, అర్బన్‌లో రూ.700, హెవీ స్కిల్డ్ వారికి రూరల్‌లో రూ.850, అర్బన్‌లో రూ.910గా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సీపీవో బాలాజీ, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సుబ్రహ్మణ్యం, అధికారులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

సైనిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1967- 74 బ్యాచ్ కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థులు

విజయనగరం టౌన్: జిల్లాలోని కోరుకొండ సైనిక పాఠశాలలో 1967- 74 బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తాము విద్యనభ్యసించిన పాఠశాలలో 50 ఏళ్ల అనంతరం కుటుంబ సభ్యులతో విచ్చేసిన పూర్వ విద్యార్థులు తమ బాల్య జీవితాన్ని గుర్తు చేసుకుని ఆనంద పరవశంలో తేలియాడారు. 50 ఏళ్లలో పాఠశాలలో జరిగిన అభివృద్ధిని, నిర్వహిస్తున్న కార్యక్రమాలను అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్ మెమోరియల్, వింగ్ కమాండర్ ఎన్‌కె రావు విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అలాగే ప్రస్తుత విద్యార్థులతో డాక్టర్ పీవీజీ రాజు ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కోరుకొండ సైనిక పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణ, ధైర్య సాహసాలకు మారుపేరుగా నిలుస్తారని అన్నారు. తమ బ్యాచ్‌లో 15 మంది సాయుధ దళాల్లో ఉన్నత అధికారులుగా విధులు నిర్వహించామని తెలిపారు. అంతేగాకుండా వైద్యులు, ఐఏఎస్, ఐఆర్ఎస్, ఎన్నో విభాగాల్లో ఉన్నత స్థానాల్లో విధులు నిర్వహించి, పదవీ విరమణ చేశామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, కల్నల్ ఎస్ఎస్ శాస్త్రిని పూర్వ విద్యార్థులు సత్కరించారు. విశ్రాంత కల్నల్ కె.ఎస్.రాజు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రోలింగ్ ట్రోఫీ, నగదు బహుమతిని పాఠశాలకు అందించారు. అనంతరం పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, పాఠశాల అధికారులు సంపక్తి భోజనాలు చేశారు.

న్యూయార్క్‌లో పారిశ్రామిక వేత్తలతో మంత్రి కొండపల్లి భేటి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): న్యూయార్క్‌లో వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించి మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించాల్సిన ఆర్థిక ప్రగతి , కృత్రిమ మేధా యూనివర్శిటీ ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల కోసం మాష్టర్ కార్డు కేంద్రం ద్వారా సాధిస్తున్న ఆర్థిక ప్రగతిని ప్రధానంగా చర్చించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మాంస ఎగుమతి ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు ఆప్‌సైడ్ ఫుడ్స్ కంపెనీ ప్రతినిధి ఉమా ఓలేటి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో దూర దృష్టి గల నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేయనున్న కృత్రిమ మేధ పంక్షనల్ యూనివర్సిటీ గురించి చర్చించినట్లు తెలిపారు. దీని ద్వారా డిజిటల్ ఉద్యోగాలు పొందటం, బెంచ్‌మార్క్ డేటా సెట్‌లను నిర్మించటం సాధ్యమవుతుందన్నారు.


విదేశీ వాణిజ్యవేత్తతో మంత్రి కొండపల్లి

హిందూ సంస్థల ర్యాలీ


తహసీల్దార్ శ్రీనుకు మెమోరాండం అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన ఘటనను నిరసిస్తూ పట్టణానికి చెందిన హిందూ సంస్థల ప్రతినిధులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కంచర వీధి కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధానవీధుల మీదుగా వేణుగోపాలస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీనుకు మెమొరాండం అందజేశారు. ఈసందర్భంగా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు, సుంకరి సాయిరమేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ దేవస్థానాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

బాడంగి: అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని రామచంద్రాపురం సెక్టార్-2లో గల అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ సమయానికి తెరిచి ఉంచాలని, తప్పక సమయపాలన పాటించాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని వారికి మంజూరు చేసిన మెనూ అందించాలన్నారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కేంద్రాలను శుభ్రంగా ఉంచాలని, ఆటపాటల ద్వారా పిల్లలకు బోధన చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన మెనూకు రికార్డులు సక్రమంగా ఉండాలని, తేడాలు ఉంటే అటువంటి కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు వినియోగించుకోవాలి

రేగిడి: చెత్తసంపద యూనిట్లు(ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు)తో సంపూర్ణ పారశుధ్యంతోపాటు, సేంద్రియ ఎరువు తయరీకి దోహదపడుతుందని వీటిని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ పద్మ పేర్కొన్నారు. పనసలవలసలో స్వచ్ఛతా హీసేవలో చెత్తసంపద యునిట్లు ప్రయోజనం, వీటి వినియోగంపై ప్రజలకు వివరించారు.

రామాయణంపై సదస్సు


మాట్లాడుతున్న స్వామి పరిపూర్ణానంద

రింగురోడ్డు: వాల్మీకి రామాయణంపై, శ్రీరామాయణ శంకరావం పేరుతో రామణారాయణంలో జరుగుతున్న మహా సదస్సు రెండో రోజు వేదపండితుల సామ, వేదోచ్ఛరణ, జ్యోతి ప్రజ్వలనతో వైభోవో పేతంగా ప్రారంభమైంది. రామాయాణంలోని ధర్మం, విలువలు, యజ్ఞాలు, రామరాజ్యంలో సీతారాములు గురించి ఆసక్తికర అంశాలను ఆధర్వ వేదవిద్వాంసులు గుదిమెళ్ల మురళీ కృష్ణామాచార్యులు, కృష్ణమూర్తి, వెంకట సోమయాజులు వివరించారు. అనంతరం స్వామి పరిపూర్ణానంద అనుగ్రహ భాషణం చేశారు.

టీసీలు ఇవ్వండి

● సీబీఎం హైస్కూల్ హెచ్ఎంను కోరిన తల్లిదండ్రులు

బొబ్బిలి, సెప్టెంబరు 28: బొబ్బిలి పట్టణంలో చారిత్రాత్మకమైన సీబీఎం బాలికల ఉన్నతపాఠశాల వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. పాతబొబ్బిలి గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థినులకు చెందిన తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు వచ్చి తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని కోరారు. టీసీల కోసం సోమవారం రావాలని హెచ్ఎం సునేత్రి వారికి తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ డీఈవోకు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కూడా విద్యార్థులకు టీసీలు ఇచ్చేయాలని హుకుం జారీ చేశారు. పాఠశాలలో గుమస్తా ఎవరూ లేరని, అంగన్వాడీకి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతోందని, సోమవారం ఇస్తామని హెచ్ఎం తెలిపారు.

విద్యార్థులు టీసీలు అడగడం నిజమే

విద్యార్థులు టీసీలు అడగడం నిజమే. సిబ్బంది ఎవరూ లేనందున సోమవారం ఇస్తామని చెప్పాను. పాఠశాలను మూసివేయాలని స్కూలు మేనేజ్‌మెంట్ డీఈవోకు లేఖ రాసింది. పాఠశాలను ఖాళీ చేయాలని ఆదేశిస్తున్నారు. నన్ను విజయనగరం డెప్యుటేషన్‌పై వెళ్లాలని ఆదేశించారు. నేను అలా డెప్యుటేషన్‌పై వెళితే వేసవి సెలవులకు ముందు నేనెక్కడ రీజాయిన్ కావాలో అని అయోమయంలో పడ్డాను. డెప్యుటేషన్ కాకుండా పూర్తిస్థాయిలో నన్ను బదిలీ చేయాలి.

-సునేత్రి, ఇన్‌చార్జి హెచ్ఎం, సీబీఎం హైస్కూలు, బొబ్బిలి

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ

దాసన్నపేట: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ ఫెస్ట్ పేరుతో వేలాది మందితో నగరంలో వేలాది మందితో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గురజాడ కళాభారతి వరకు కొనసాగింది. అనంతరం భగత్‌సింగ్, గాంధీ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రామ్మోహన్, కేంద్ర కమిటీ సభ్యురాలు పావని, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వెంకటేష్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


సంఘీభావం ప్రకటిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రతి ఇంటికీ సౌర విద్యుత్: జేసీ

కలెక్టరేట్: ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ వినియోగించుకునే విధంగా వినియోగదారులను చైతన్య పరచాలని జేసీ సేతుమాధవన్ కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలుపై జేసీ చాంబర్‌లో ఆయా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ 207 దరఖాస్తులు రాగా, 175 ఇళ్లకు ఏర్పాటు చేశామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో శ్రీధర్ రాజాలు ఉన్నారు

నేడు జిల్లాకు శాప్ ఎండీ

కలెక్టరేట్: రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఎండీ గిరీశ పీఎస్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 12 గంటలకు జిల్లా కేంద్రం చేరుకుని విజ్జి స్టేడియం వద్ద శాప్ క్రీడా మైదానన్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

రింగురోడ్డు: నగరంలో త్వరలో మరో అన్నక్యాంటీన్ ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం ఘోషాసుపత్రి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న అన్నక్యాంటీన్ ప్రోగ్రెస్‌పై ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎం.ఈ కె. శ్రీనివాసరావు, డి.ఈ రామసుబ్బారావు పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీగా కూర్మినాయుడు

కలెక్టరేట్: జిల్లా గృహ నిర్మాణ ప్రాజెక్టు డైరక్టరుగా పొన్నాడ కూర్మినాయుడు బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా పీడీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడ వచ్చారు.

పది విద్యార్థులకు సామర్థ్య పరీక్ష

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు శనివారం మండల విద్యాశాఖాధికారి నరసింగరావు ఆధ్వర్యంలో సామర్థ్య పరీక్ష నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. హెచ్ఎం ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

హిందీ నేర్చుకోవాలి

రాజాం రూరల్: ప్రతిఒక్కరూ విధిగా హిందీ నేర్చుకోవాలన గురవాం కెజీబీవీ ప్రిన్సిపాల్ సావిత్రి స్పష్టం చేశారు. హిందీ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజాం ప్రాంతంలో హిందీ భాషాభివృద్ధికి హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. నియోజకవర్గ పరిధిలోని హిందీ ఉపాధ్యాయులు, ప్రచారక్‌లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

రాజాం రూరల్: నేరాల నియంత్రణపై దృష్టి కేంద్రీకరించాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు స్పష్టం చేశారు. రాజాం సర్కిల్ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. టౌన్, రూరల్ సీఐలతో పలు అంశాలపై చర్చించారు. రాజాంలో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

రాజాం రోడ్డు విస్తరణకు సహకరించాలి

రాజాం: రాజాం- పాలకొండ, రాజాం-చీపురుపల్లి రోడ్డు విస్తరణకు వ్యాపారవర్గాలు, ప్రజలు సహకారం అందించాలని రాజాం మున్సిపాలిటీ కమిషనర్ రామప్పలనాయుడు కోరారు. పట్టణంలో ఒకప్రైవేటు కల్యాణమండపంలో శనివారం మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యాజమానులు, వ్యాపారస్థులతో సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడారు.

కళాశాలను సాయంత్రం 5 వరకు నిర్వహించాలి

కొత్తవలస: కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులతో శనివారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణా రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా వృత్తి విద్యాధికారి బీమశంకరరావు హాజరై పలు సలహాలు, సూచనలను అందించారు. కళాశాల పనివేళలను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించాలని, వెనుకబడిన తరగతికి చెందిన విద్యార్థులకు కొత్తవలసలో వసతిగృహం సదుపాయం కల్పించాలని తీర్మానించారు. తరగతి గదుల్లోకి మొబైల్ ఫోన్‌లను తీసుకురావడాన్ని నిషేధించాలన్నారు. విద్యార్థుల కోసం తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని అధ్యాపకులు తెలిపారు.

రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలి

రాజాం: ఉపాధిహామీ పనులు గుర్తించేటప్పుడు రైతులకు ఉపయోగపడే విధంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు. ఏపీడీ ఎం.శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం గడిముడిదాం గ్రామంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో ఫారంపాండ్స్, మొక్కలు నాటే కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం, నాలుగు మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై దుష్ప్రచారం

బొబ్బిలి: తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం వైసీపీ నాయకులు నిరసన చేపట్టారు. స్థానిక స్వామివారి వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చంద్రబాబు లక్ష్యంగా పెద్ద ఎత్తున విమర్శలు చేశారు. తొలుత 101 కొబ్బరికాయలు కొట్టి జై గోవిందా అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సావు వెంకటమురళీకృష్ణారావు, చోడిగంజి రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.ఎస్.కోట దేవి మాత ఆలయంలో వైసీపీ పూజలు

శృంగవరపుకోట: తిరుపతి లడ్డ వివాదంనకు నిరసనగా శనివారం శృంగవరపుకోట శ్రీదేవి మాత ఆలయం, గాయత్రి ఆలయంలోని శ్రీవెంకటేశ్వర స్వామికు పూజలు చేసారు. మాజీ శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు, నాయకులు వేచలపు వెంకట చినరాము నాయుడు, వాకడ రాంబాబు, నెక్కల నాయుడు బాబు తదితరులు కార్యకర్తలతో కలపి ఈ పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ తీరును విమర్శించారు.

జాషువా నేటి తరానికి ఆదర్శం

రామభద్రపురం: మహాకవి గుర్రం జాషువా నేటి తరానికి ఆదర్శనీయుడని నాయుడువలస సర్పంచ్ నిడగంటి లక్ష్మి అన్నారు. శనివారం నాయుడువలస పాఠశాలలో హెచ్ఎం జేసీ రాజు ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి జాషువా జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** అలజంగి సీబీఎం పాఠశాలలో హెచ్ఎం కె.కృష్ణదాస్ ఆధ్వర్యంలో శనివారం గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** కలమే ఆయుధంగా అనేక రచనలు చేసిన మహనీయుడు గుర్రం జాషువా అని బహుజన సమాజ్‌వాద్ పార్టీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జాషువా జయంతిని నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. బొత్స బుద్ధుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురంలో..


బొబ్బిలి రూరల్: అలజంగిలో

గంజాయితో యువకుల అరెస్టు


గంజాయిని పరిశీలన చేస్తున్న సీఐ

కొత్తవలస: సూట్ కేస్‌లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. కొత్తవలస సీఐ షణ్ముఖరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన విను మోహన్(32), ప్రసన్న జైన్ ఐశ్వర్య(23) అరుకు నుంచి విశాఖపట్టణం వెళ్తున్న బస్సులో ప్రయాణికుల మాదిరాగానే 9 కేజీల 700 గ్రాముల గంజాయిని సూట్ కేసులో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. కొత్తవలస సీఐ షణ్ముఖరావుకు వచ్చిన కచ్చితమైన సమాచారం ప్రకారం శనివారం కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద బస్సును ఆపి తనఖీ చేయగా ఈ ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. విశాఖపట్టణం రైల్వే స్టేషన్ వద్ద బస్సు దిగి రైలులో కేరళ వెళ్లడానికి ప్రణాళిక వేసుకున్నట్టు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు దర్యాప్తులో ఉందన్నారు.


నిందితులతో ఎస్.కోట పోలీస్‌లు

● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట మండలం బొడ్డవర చెక్ పోస్టు వద్ద పోలీసులు రెండుకేజీల గంజాయితో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. శనివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఎస్.ఐ ఎస్.భాస్కర రావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తున్నారు. ఓ వాహనంపై అరుకు నుంచి వస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన శశికుమార్, మణికందన్‌ను ప ట్టుకుని తనిఖీ చేయడంతో రెండు కేజీల గంజాయి బయటపడింది. సీఐ వీఎస్ మూర్తి కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

కేంద్రప్రభుత్వ ఉద్యోగిపై లైంగిక వేధింపుల ఆరోపణ

● దేహశుద్ధి చేసిన బాధితురాలి బంధువులు

బొబ్బిలి, సెప్టెంబరు 28: ఓ కేంద్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణ రావడంతో బాధితుల బంధువులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన బొబ్బిలిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఓ కాలనీలో కేంద్రప్రభుత్వ అధికారి తన కింద పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధిస్తున్నాడు. కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అనధికార కార్యాలయంగా ఏర్పాటు చేసుకుని కిందిస్థాయి మహిళా ఉద్యోగులను అక్కడకు రప్పించి అసభ్యకర రీతిలో వ్యవహరిస్తున్నాడు. ఈ అధికారి వ్యవహారాన్ని ఓ బాధితురాలు తమ కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారు శనివారం సదరు అధికారి ఇంటికి చేరుకున్నారు. ఆగ్రహంతో అతనిపై విరుచుకుపడ్డారు. దేహశుద్ధి చేసి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. సాటి ఉద్యోగులను కుటుంబసభ్యుల మాదిరిగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించకుండా అనైతికంగా వ్యవహరిస్తే చట్టానికి అప్పగిస్తామన్నారు. అయితే ఈ అంశంపై ఎటువంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జామి: మండలంలోని శాసనపల్లి గ్రామం సమీపంలో ఉన్న సోమయాజుల పాలెం ఏటినుంచి తరలుతున్న ఇసుక ట్రాక్టర్‌ను స్థానికులు అడ్డుకుని పోలీసులకు శనివారం అప్పగించారు. సాధారణ ప్రజలకు అందుబాటులో లేని ఇసుక దొంగలకు బాగా దొరుకుతుందని అందుకే వీటిని పట్టుకున్నామని గ్రామ యువకులు తెలిపారు. అనంతరం జామి పోలీసులు వచ్చి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

బెల్లం ఊట ధ్వంసం

వంగర: రాజులగుమ్మడలో నాగావళి నదీ సమీపంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటలను పోలీసులు ధ్వంసం చేశారు. శనివారం గ్రామంలో సారా తయారు చేస్తున్నట్టు గ్రామస్థులనుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై శంకర్ తనసిబ్బందితో దాడులు నిర్వహించారు. నాగావళి నది ఒడ్డున 8 డ్రమ్ముల్లో ఉన్న బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. అయితే ఈ ఘటనలో నిందితులెవరూ దొరకలేదు.

యువకుడిపై పోక్సో కేసు

శృంగవరపుకోట: బాలికపై అత్యాచార కేసులో ఎస్.కోటకు చెందిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారం చేసినట్లు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 24న పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ వీఎస్ మూర్తి తెలిపారు. ఈ ఘటనలో నిందితుడిని డీఎస్పీ వీరమార్ శనివారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రాజాం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో సీఐ ఉపేంద్రతో కలిసి శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, క్రిమినల్ చట్టాలు, ఈవ్ టీజింగ్ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: యువత, పెద్దలు డ్రగ్స్, ఆల్కహాల్ తదితర మత్తుపానియాలకు దూరండా ఉండాలని రాజాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పేర్కొన్నారు. మండలంలో లచ్చరాయపురంలో శనివారం సంకల్పం పేరుతో డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రతపై చైతన్య సమావేశం నిర్వహించారు. రేగిడి ఎస్ఐ నీలావతి, లచ్చారాయపురం గ్రామపెద్దలు, ప్రజలు ఉన్నారు. ●యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రహదారి భద్రత నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్ఐ నీలావతి పేర్కొన్నారు. మండలంలో ఉంగరాడ గ్రామంలో శనివారం సంకల్పం పేరుతో డ్రగ్స్, మద్యం నియంత్రణ, రహదారి భద్రతపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏఎస్ఐ రాజారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు

రేగిడి: స్వర్ణాంధ్ర 2047లో బాగంగా వచ్చే ఐదేళ్లలో విద్యారంగంలో తీసుకోవాల్సిన సంస్కరణలపై శనివారం మండలస్థాయి డిబేటింగ్, ఈజీరైటింగ్‌పై లింగాలవలస హైస్కూల్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఎంఈవో వరప్రసాదరావు, బి ఎరకయ్య పర్యవేక్షించారు. విజేతలుగా నిలిచిన లింగాలవలస, ఏవీపురం హైస్కూల్ విద్యార్థులకు పాఠశాలలో ఎంఈవోల చేతుల మీదగా బహుమతి ప్రదానం చేసారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతలకు అభినందనలు

విజయనగరం దాసన్నపేట: హైదరాబాదులోని షాద్‌నగర్ కొత్తూరు జిల్లాలో ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు సాగిన మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు విజయనగరం జిల్లా నుంచి పలు స్కూల్స్‌కి చెందిన క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. వీరిని ఏబీ చారిటబుల్ ట్రస్టు, జై హనుమాన్ అశ్విని మార్షల్ ఆర్ట్స్ స్పోర్ట్సు, కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

పశువైద్య కళాశాల పనితీరు భేష్



మొక్కలు నాటుతున్న దృశ్యం

గరివిడి: గరివిడిలోని పశువైద్య కళాశాల పనితీరు బాగుందని పశు సంవర్ధక శాఖ రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎంఎం నాయక్ అన్నారు. స్థానిక కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాలలో భవనాల నిర్మాణ పనులను, బాలురు, బాలికల వసతి గృహాలను సందర్శించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా కళాశాలలో మొక్కలు నాటారు. బోధన, బోధనేతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను, అధ్యాపకులు డా.సుధారాణి, అంబేడ్కర్, షేక్ మస్తాన్, పి.ప్రకాష్ కుమార్, ఎస్.గంగునాయుడు, ఎస్.హరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపరచండి



జరజాపుపేటలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న రామకృష్ణ

నెల్లిమర్ల: విద్యార్థుల ప్రమాణాల స్థాయి పెంపునకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డైట్ లెక్చరర్ మాత రామకృష్ణ సూచించారు. జరజాపుపేట, కొండవెలగాడ ఉన్నత పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బేస్ లైన్ టెస్ట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు రేవళ్ల ఆదినారాయణ, జ్ఞానశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గంధాన్ని భరించలేం



నిరసన తెలుపుతున్న ప్రజలు

చీపురుపల్లి: పట్టణంలో ఉన్న సాంఘిక సంక్షేమ పాఠశాల నుంచి వెదజల్లుతున్న దుర్గంధాన్ని తాము భరించలేకపోతున్నామని రామాంజనేయ కాలనీ, ముస్లిం కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల వెనక వైపున ఉన్న గేటు వద్ద ఆహార పదార్థాల వ్యర్థాలను పడేస్తున్నారని వారు ఆరోపించారు. కుళ్లిపోయిన ఆహారం, గుడ్లు, కూరగాయల వ్యర్థాల వల్ల నిత్యం దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఇప్పటికైనా, పాఠశాల యాజ మాన్యం లేదా పంచాయతీ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నెల్లిమర్లలో కమిషనర్ పర్యటన

నెల్లిమర్ల: నగర పంచాయితీ నూతన కమిషనర్ కె.అప్పలరాజు నెల్లిమర్లలోని అన్ని ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. పారిశుధ్య కార్మికులు, పర్యవేక్షకుడు ఉమాశంకర్‌తో మాట్లాడి పలు సూచనలు చేశారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికలు తీయాలని, రోడ్లపై చెత్తను తొలగించాలని ఆదేశించారు. ప్రతిరోజు రిజర్వాయర్‌లో క్లోరినేషన్ చేసిన తర్వాత మాత్రమే నీటి సరఫరా చేయాలని పంప్‌హౌస్ సిబ్బందిని, ఏఈలను ఆదేశించారు.

లడ్డూపై దుష్ప్రచారం తగదు

చీపురుపల్లి: తిరుపతి లడ్డూపై దుష్ప్రచారం చేయడం తగదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. లడ్డూలో కల్తీ జరిగిందని కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఇప్పిలి వెంకటనరసమ్మ, మీసాల విజయలక్ష్మి, జడ్పీటీసీలు వలిరెడ్డి శిరీష, వాకాడ శ్రీను, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, నాయకులు కెవీ సూర్యానారాయణరాజు, ఇప్పిలి అనంతం తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: చింతలవలసలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల లడ్డూపై అసత్య ప్రచారాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డెంకాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, వైస్ ఎంపీపీ తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య డిమాండ్ చేసారు. శనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బజార్ సెంటర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వంద రోజుల పాలనపై ఏమీ చెప్పుకోలేక తిరుపతి లడ్డూలో అపచారం జరిగిందని ప్రజలను నమ్మబలికే కార్యక్రమం చేపట్టడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బొండపల్లి: తిరుపతి లడ్డూపై అనవసర రాద్ధాంతం చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైసీపీ నాయకులు కోరారు. శనివారం బోడసింగిపేటలోని వేంకటేశ్వరాలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాష్, మండల పార్టీ అధ్యక్షులు బొడ్డల చిన్నంనాయుడు, నాయకులు మీసాల తులసి, మహంతి రమణ, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వైసీపీ శ్రేణులు

మెంటాడ: తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. ఈ మేరకు వైసీపీ శ్రేణులు స్థానిక వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.రామారావు, కె .పైడుపునాయుడు, కనిమిరెక త్రినాథరావు, రత్నాకర్ నాయుడు, సారిక ఈశ్వరరావు, అచ్యుత, కలిశెట్టి సూర్యనారాయణ, పొట్టంగి దుర్గ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి

హౌసింగ్ పీడీ కూర్మినాయుడు ఆదేశం



నెల్లిమర్ల: లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ కూర్మినాయుడు

నెల్లిమర్ల: హౌసింగ్ కాలనీ ఇళ్ల నిర్మాణాలను వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ కూర్మినాయుడు సూచించారు. జరజాపుపేట హౌసింగ్ కాలనీలో మన ఇళ్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, హౌసింగ్ ఈఈ వి.శ్రీనివాస్, ఏఈ రొంగలి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు మంజూరైన లబ్ధిదారులు త్వరతగతిన నిర్మాణాలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ డీఈ సత్యనారాయణ అన్నారు. శనివారం పురిటిపెంట సచివాలయంలో 'మన ఇళ్లు- మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు ఇంటి నిర్మాణాలు చేపట్టని వారు వచ్చే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. లేదంటే కేంద్రం నుంచి వచ్చే రుణాలకు అర్హత ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కిషోర్ కుమార్, డి.టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: ఇప్పటికే ప్రారంభమై... వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు మార్చిలోగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జోసెఫ్ లబ్ధిదారులకు సూచించారు. ఎస్.చింతలవలస గ్రామంలో శనివారం మన ఇళ్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. మండలంలో 1919 ఇళ్లకు 1600 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వి.సుబ్రహ్మణ్యం, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, సర్పంచ్ కంది పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: గృహనిర్మాణాలు మంజూరు ఉన్న ఇల్లు బెస్‌మెంట్, ఇతర స్టేజ్‌లో ఉన్న ఇళ్లు తక్షణమే పూర్తిచేయాలని ఎంపిడిఓ శ్యామాలకుమారి హసింగ్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలో మన ఇళ్లు, మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అధికార్లుబందం ఉంగరామెట్ట లేఔట్‌ను క్షత్రస్థాయిలో తనిఖీచేసారు. ఎంపిడిఓ, ఇఓఆర్డి సత్యన్నారాయణ, హౌసింగ్ సిబ్బంది తదితర్లు చైతన్యం కల్గించారు.

బాడంగి: మండల కేంద్రంలో తహసీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో మనఇల్లు-మన గౌరవం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ మేరకు బాడంగిలో మంజూరైన 30 ఇళ్లలో 25 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారని, మిగిలిన 5 ఇళ్ల పూర్తికావాల్సి ఉంది. ఈ మేరకు తహసీల్దార్ కాలనీకి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరపల్లి ।నివాసరావు, పంచాయతీ సెక్రటరీ సూర్యరావు, డిజిటల్ అసిస్టెంట్ రూప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్, గుండ సంగయ్యలతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో శనివారం ఎంపీటీసీ నాగరాజు ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సభలో పేదల గృహ నిర్మాణ పథకంపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం వచ్చిందని, పెండింగ్ లబ్ధిదారులు వెంటనే తమ ఇళ్ల నిర్మాణాలను మొదలుపెట్టాలని, బిల్లులు వెంటనే పేమెంట్ చేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

విజయనగరం రింగురోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమం ద్వారా శతశాతం ఇళ్లనిర్మాణాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శనివారం ఆనంద్ గజపతి ఆడిటోరియంలో గృహలబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం: బొద్దాం పంచాయతీలో అసంపూర్తి ఇళ్ల శతశాతం పూర్తిచేసేందుకు శనివారం మండలనోడల్ అధికారి నిర్మలా కుమారి ఆధ్వర్యంలో మన ఇళ్లు, మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. తక్షణమే ఇళ్లు పూర్తిచేయాలని నోడల్ అధికారితో పాటు, రాజం సబ్‌డివిజన్ హౌసింగ్ ఈఈ, ఎంపీడీవో శ్రీనివాసరావు లబ్ధిదారులకు చైతన్యం కల్గించారు.

అనధికారిక నిర్మాణాలను ఉపేక్షించం

విజయనగరం రింగురోడ్డు: అనధికార కట్టడాలు, ఆక్రమణలను ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ఇసుక, డెబ్రీస్, పిక్క ఉండకుండా చూడాలన్నారు. రహదారికి అడ్డంకులు కలిగిస్తే అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. ఏసీపీ అమ్మాజీ రావు, టీపీవో ఫిలిప్, టౌన్ సర్వేయర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్రప్రభుత్వం పెన్షనర్లకు కమ్యుటేషన్‌ను 15 సంవత్సరాల నుండి 10 సంవత్సారాలకు కుదించాలని జిల్లా మానవ హక్కులు వేదిక కన్వీనర్ ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో పెన్షనర్ల కమ్యుటేషన్‌లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడారు. సమావేశంలో పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

నెల్లిమర్ల: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.గణేష్ అన్నారు. కొండ గుంపాం గ్రామంలో శనివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో గంజాయి వినియోగించినా, అమ్మకాలు, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహిళా సంరక్షణ కార్యదర్శి జి.దివ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గరివిడి: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్ఐ లోకేశ్వరరావు హితవు పలికారు. గరివిడిలో గల ప్రయివేటు కళాశాలలో విద్యార్థులకు సత్ప్రవర్తనపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అనేక మంది మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

జనసేన నేతల ప్రాయశ్చిత హోమం



పూర్ణాహుతిలో పాల్గొన్న కూటమి నాయకులు

చీపురుపల్లి: స్థానిక గరివిడి రోడ్డులో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రాయశ్చిత హోమం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ గద్దే బాబూరావు, కూటమికి చెందిన నాలుగు మండలాల ప్రతినిధులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, ఇప్పిలి నీలకంఠం, మన్నెపురి శ్రీనివాసరావు, రౌతు కృష్ణవేణినాయుడు, కోట్ల కృష్ణ, లక్ష్మనాయుడు, తవిటినాయుడు, సత్యనారాయణ, గౌరి, కనకరాజు, హిందూ ధర్మ ప్రచారకులు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

గజపతినగరం: గ్రామాల్లో అర్హులైన యువతీ, యువకులను ఓటర్లుగా నమెదు చేయాలని ఈఆర్ఓ ప్రమీలాగాంధీ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్ల మార్పులు, చేర్పులతో పాటు చనిపోయిన వారి వివరాలను నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉపతహసీల్దార్ సతీష్, మండల టీడీపీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మనాయుడు, సీపీఎం నాయకుడు జి.శ్రీనివాస్, వైసీపీ నాయకుడు బి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోండి

నెల్లిమర్ల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ జి.ప్రసన్న అన్నారు. కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసన్న మాట్లాడుతూ బాలామృతం విశిష్టతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ సమన్వయకర్త అశోక్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

మెంటాడ: రాబంధ గ్రామంలో శనివారం రాత్రి అక్రమంగా విక్రయిస్తున్న వారి నుంచి 15 మద్యం సీసాలను ఆంధ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.సీతారాం చెప్పారు.

పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు

విజయనగరం రూరల్: పెంపుడు జంతువులకు సకాలంలో రేబిస్ నిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ జెడీ వైవీ రమణ సూచించారు. ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బహుళార్థక సాధక ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, మనకిష్టమైన జంతువులకు అనేక రకాల జునోటిక్ వ్యాధులు సంక్రమించే ప్రమాదం వుందని, తరచూ వాటికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సకాలంలో టీకాలు కూడా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో 95 పెంపుడు కుక్కపిల్లలకు రేబిస్‌వ్యాక్సిన్ వేశారు. పశు సంవర్ధక శాఖాధికారులు మహాలక్ష్మీ, కేవీ రమణ, రామప్రసాద్, ధర్మారావు, చక్రవర్తి, కన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం

విజయనగరం రూరల్: విజయనగరం పుత్సలవీధికి చెందిన కొల్లి పార్వతికి ఇటీవల జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. ఆమెకు శస్త్ర చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న అదితి గజపతిరాజు లేఖ రాయడంతో సీఎం చంద్రబాబు వెంటనే చెక్‌ను పంపించారు. శనివారం ఎమ్మెల్యే పుత్సలవీధికి వెళ్లి పార్వతి కుటుంబాన్ని పరామర్శించి, సీఎం రీలిఫ్ ఫండ్ నుంచి రూ.1 లక్ష 15 వేల చెక్కును ఆమెకు అందించారు.

కబడ్డీ పోటీల విజేత నెల్లిమర్ల

నెల్లిమర్ల: అనకాపల్లి జిల్లా సాలాపువానిపాలెంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఆహ్వానపు మహిళల కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు ప్రథమ స్థానం సాధించింది. అలాగే అనకాపల్లి జిల్లా మునగపాకలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో కూడా ఇదే మహిళల జట్టు ప్రథమ స్థానం సాధించింది. వీరిని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు బోని సూర్యనారాయణ, రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు అభినందించారు.

వీఆర్వోల బదిలీ

రాజాం రూరల్: నియోజకవర్గ పరిధిలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్ 1, గ్రేడ్ 2 వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకాపల్లి వీఆర్వో గెడ్డాపు అనంతరావును ఒమ్మి, సోపేరు వీఆర్వో ఎం.రాజేశ్వరిని శ్యాంపురం, గురవాం వీఆర్వో మొకర రాజేశ్వరిని పెనుబాక, పెనుబాక వీఆర్వో శాసపు వెంకటప్పలనాయుడ్ని ఎం.జె.వలస, ఒమ్మి వీఆర్వో టి.పార్వతిని గడిముడిదాంకు బదిలీ చేశారు. పొగిరి 1 వీఆర్వో ఆబోతుల లక్ష్మనాయుడ్ని వంగర మండలం మద్దివలసకు, శ్యాంపురం వీఆర్వో తీగల అప్పారావును రాజయ్యపేట, గడిముడిదాం వీఆర్వో పెంట అచ్యుతరావును సంతకవిటి మండలం మండువకురిటి, గ్రేడ్ 2కి సంబంధించి ఆగూరు వీఆర్వో కొల్లి రామును బుచ్చెంపేటకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వరద బాధితులకు విరాళం

శృంగవరపుకోట: జిల్లా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శనివారం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి వరద బాధితుల సహాయార్థం రూ.25వేల చెక్కును అందించారు. ఇవి నియోజకవర్గంలోని పలు విద్యా సంస్థలు సేకరించిన విరాళాలని తెలిపారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్, ఎల్.కోట మాజీ ఎంపీపీ కొల్లి వెంకటరమణ మూర్తి, కొత్తవలస మండలం చింతలపాలెం సర్పంచ్ మాకిన నవీన్ పాత్రుడు ఉన్నారు.

ఈకేవైసీ నమోదు తీరు పరిశీలన



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న జేడీ తారకరామారావు

గంట్యాడ: ఈ క్రాప్ నమోదులో భాగంగా రైతుల ఈకేవైసీ నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు శనివారం బుడతనాపల్లి గ్రామంలో పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు అంతా వెంటనే ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. దీని వల్ల పండిన ధాన్యాన్ని సులువుగా విక్రయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

తోటపల్లి నీరు ఎప్పుడిస్తారు?

గుర్ల: చీపురుపల్లి నియోజక వర్గ ప్రాంత ప్రజలకు, రైతులకు తోటపల్లి నీరు అందిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడులు అన్నారు. మండల వైసీపీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ పరిపాలనలో సీఎం చంద్రబాబు ఘోర వైఫల్యం చెందారని, రైతులకు సాగునీరు అందించలేని స్థితిలో స్థానిక ఎమ్మెల్యే ఉన్నారని విమర్శించారు. అన్ని వర్గాల వారికి ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయడాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు ఎరువులు అందిం చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు.

అన్నదానం

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మీసాల జానకిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిట్టుపల్లి మాజీ సర్పంచ్ అల్లు శ్రీనివాసరావు, బోడసింగి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.